క్లుప్తంగా

ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలి



అంబాజీపేట పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నందున గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం డాక్టర్ వి.గౌతమి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఏఎన్‌ఎంలు, ఆశాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. రాబోయే రోజుల్లో పీహెచ్‌సీని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో నందంపూడి సర్పంచ్ పితాని మంగాదేవి, వైద్యాధికారి బి.శ్రీనివాస్, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్‌లో ఓపెన్ ప్రవేశాలకు నోటిఫికేషన్

మామిడికుదురు: 2023 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలయిందని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సీహెచ్ నిరంజని శుక్రవారం తెలిపారు. అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మధ్యలోనే చదువును ఆపేసిన వారికి వయస్సుతో సంబంధం లేకుండా 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతికి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్మీడియెట్ ప్రవేశానికి అడ్మిషన్ పొందేందుకు అర్హులని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అతి తక్కువ ఫీజుతో పది, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇతర వివరాలకు అసిస్టెంట్ కోఆర్డినేటర్ సీహెచ్ రమేష్‌బాబు సెల్ నంబర్ 99494 49130ను సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనభ్యసించాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు బాట అవుతుందని హెచ్‌ఎం కడలి సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు దాతలు అందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు డి.అంజిబాబు, పి.రాంబాబు, సీహెచ్ ఫణికుమార్, డీవీ రమణారావు, ఎం.బాలకృష్ణ, కె.సుధ, ఎల్.పూర్ణిమ, ఆక్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబులు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారన్నారు. దాతల ఇచ్చిన ప్రోత్సాహంతో శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, ఎంఎల్ గాయత్రి, ఎస్‌వీఆర్‌ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో పక్కా సీసీ రోడ్లు

మామిడికుదురు: మారు మూల ప్రాంతాల్లో పాడైపోయిన రోడ్ల స్థానే పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తెలిపారు. లూటుకుర్రులో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలు వెరసి రూ.నాలుగు లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచ్ తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, వార్డు సభ్యులు బోణం అబ్బులు, రొక్కం తేజేశ్వరరావు, పెద్దలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: వ్యక్తికి గాయాలు

కొత్తపేట: ఆటో బోల్తా పడి దానిలో ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏఎస్సై డి.శశాంక తెలిపిన వివరాల ప్రకారం ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి రామారావు శుక్రవారం కొత్తపేటలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వచ్చాడు. తిరిగి తన ఆటోలో వెళ్తుండగా ఆ ఆటో ఏనుగులమహల్ వెళ్లే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. దానిలో ప్రయాణిస్తున్న రామారావుకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగలో శుక్రవారం పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3620 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విమర్శలు లేని పాలన జగన్‌తోనే సాధ్యం

- వీరవల్లిపాలెం, ఈదరాడల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



వీరవల్లిపాలెంలో మహిళకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



ఈదరాడలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అయినవిల్లి: రాష్ట్రంలో విమర్శలు లేని పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని వీరవల్లిపాలెంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, స్థానిక అధికారులు సేవలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగారు, ఎవరైనా అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు విమర్శించేందుకు వీలులేని విధంగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పి.చిట్టిరాజు, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఎం.శ్రీలక్ష్మి మంగాదేవి, పార్టీ నాయకులు మిండగుదిటి రాంబాబు, మిండగుదిటి చిన్ని, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన్నిబాబు, మేడిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజలకు అచంచలమైన విశ్వాసం

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఉద్ఘాటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈదరాడలో శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా అమలు చేసి ప్రజల వద్దకు తల ఎత్తుకుని వెళ్తున్నామని ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా అటు అభివృద్ధి, ఇటు సంక్షేమంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఎక్కడా మాట తప్పలేదు, మడమ తిప్పలేదని వరప్రసాదరావు, ఇజ్రాయిల్ చెప్పారు. అందుకే ప్రజలు జగన్ సర్కారును ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ నేత యెరుబండి సూరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, పార్టీ నేతలు చేట్ల సత్యనారాయణ, సూరిశెట్టి బాబి, ఎండీవై షరీఫ్, వడ్డే ఆదిబాబు, యెరుబండి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..



ఆలమూరులో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ, ఇంటింటా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఆలమూరులో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గా భవాని ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సిద్ధార్థ హైస్కూల్ ఏరియా కాలనీ, భువనేశ్వరి చెరువు ప్రాంతాల్లో ఈకార్యక్రమం జరిగింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలోని అర్హులందరికీ ఇళ్ల స్థలాలను అందజేసి సకల సౌకర్యాలతో కూడిన కాలనీలను ఏర్పాటు చేసి లక్షల విలువైన ఆస్తిని దశల వారీగా సీఎం జగన్ తమ ఆడపడుచులకు కట్నంగా ఇస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే కాపు కల్యాణ మండపం నిర్మాణాన్ని పూర్తి చేయగా శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

తీవ్ర అస్వస్థతతో చికిత్స పొంది ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న ఆలమూరు ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి అల్లుడు సంజయ్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంఏఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు .

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



ఆలమూరులో గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించి, చక్కని పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్య రక్షణకు తోడ్పాటును అందించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని భువనేశ్వరి చెరువు ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ జరిగింది. సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాలింతలు, గర్భిణులు సౌకర్యార్థం టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్)ను అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గత ప్రభుత్వం కంటే మెరుగైన విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులుతో పాటు చిక్కి, బెల్లం, ఖర్జూరం అందజేస్తున్నామన్నారు. కొత్తపేట సీడీపీఓ పి.శారద, సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. మామిడికుదురు పంచాయతీ వద్ద జరిగిన సమావేశంలో సర్పంచ్ గొస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు వర్ధినేని రాము, నయినాల సీతా మహాలక్ష్మి, లూటుకుర్రులో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, మాకనపాలెంలో సర్పంచ్ మద్దాల బాబూరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో అంగన్ వాడీ కేంద్రాల వద్ద గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించేవారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తినడం ఇబ్బందిగా ఉండేదన్నారు. దీన్ని గ్రహించిన ప్రభుత్వం పౌష్టికాహారాన్ని నేరుగా ఇంటికే అందజేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.అన్నపూర్ణ, జి.సూర్యకాంతం, వీఎంజీ కుమారి, ఎంటీ రమాబాయి, ఎస్.రాజ్యలక్ష్మి, టి.శాంతి, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేగంగా ఆర్‌అండ్‌బీ, జీజీఎంపీ రోడ్ల నిర్మాణం



గంటిలో సీసీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బంగార్రాజు

కొత్తపేట: మండలంలోని గంటిలో ఆర్‌అండ్‌బీ, గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు తెలిపారు. గతేడాది పలివెల-పల్లిపాలెం రోడ్డుకు 1.40 కోట్లు మంజూరు కాగా ఆ నిధులు సరిపోక దానిలో 1.01 కిలోమీటరు మేర ఈ రోడ్డు మిగిలిపోయింది. కొత్తపేట, రావులపాలెం మండలాల పరిధిలోని గంటి పల్లిపాలెం, గోపాలపురం పల్లిపాలెం గ్రామాలకు సంబంధించిన ఉమ్మడి ఆర్ అండ్‌బీ రోడ్డు. దీని ఆధునీకరణకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషితో రూ.90 లక్షలు మంజూరయ్యాయి. దీనిలో 650 మీటర్లు సీసీ రోడ్డు, మిగిలింది బీటీ రోడ్డుగా నిర్మించాల్సి వుంది. ఈ సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా గంటిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు కాగా ఆ నిధులతో మెయిన్ విలేజ్‌లో రెండు, పెదపేట, పల్లిపాలెంలో సీసీ రోడ్లు నిర్మాణం పనులను సర్పంచ్ సాగి బంగార్రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి, సహకారంతో ప్రధానమైన రోడ్ల సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్ల జనార్ధనరావు, మాజీ సభ్యురాలు పోలిమాటి అంజనీకుమారి, యడ్ల కృష్ణమూర్తి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా 'యనమదల'



యనమదల నాగేశ్వరరావు

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా యనమదల నాగేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఆయన మడికి గ్రామ సర్పంచ్‌గా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో తన సేవలను అందిస్తూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి విధేయుడిగా ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. తన సేవలను గుర్తిస్తూ ఏఎంసీ ఛైర్మన్‌గా నియామించడంపై ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అధ్యక్షుడు యనమదల కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీకి, ఎమ్మెల్యేకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీలో కష్టపడే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందనే దానికి ఈ పదవే నిదర్శనమని యనమదల పేర్కొన్నారు.

నూతన పాలకవర్గం సభ్యులు వీరే..

ఏఎంసీ ఛైర్మన్‌గా యనమదల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వెత్సా సురేష్‌కుమార్, డైరెక్టర్లుగా షేక్ లాల్ బేబీ, గాడా అన్నపూర్ణ, కటారి కుమారి, గానుగుల లక్ష్మీదుర్గ, అంగర సింహాద్రి, పోలాబత్తుల భాగ్యవతి, ఉండమట్ల శ్రీలక్ష్మి, తాతపూడి సత్యప్రియ, బుడ్డిగ వీర వెంకటరావు, నెల్లి రమేష్‌బాబు,, చవ్వాకుల శ్రీనివాస్, సత్తి రామచంద్రారెడ్డి, కుడుపూడి లోవ సత్యనారాయణ, పెదనల్ల పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకటరాయుడు, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ నేలపూడి లావణ్యలను నియమితులైన వారిలో ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



శ్యామసుందరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లోవరాజు

మామిడికుదురు: అనారోగ్యంతో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో పెదపట్నంలంకకు చెందిన ఉండ్రు శ్యాంసుందరావు చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితి చూసి చలించిన అదే గ్రామానికి చెందిన వలంటీర్ యేడిద లోవరాజు తన సొంత ఖర్చులతో అమలాపురం వెళ్లి సుందరరావుకు పింఛన్ అందించాడు. వలంటీర్ లోవరాజుకు రోగి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు లోవరాజును అభినందించారు.



రామకృష్ణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నందిని

అంబాజీపేటలో..

అంబాజీపేట: అనారోగ్యంతో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగలకుర్రుకు చెందిన అధికారపు రామకృష్ణ వద్దకు వలంటీర్ బొక్కా నందిని వెళ్లి వృద్ధాప్యపు పింఛన్ గురువారం రాత్రి పంపిణీ చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా రామకృష్ణ చికిత్స పొందుతున్నారని తెలుసుకుని నందిని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. ఆమెను పలువురు అభినందించారు.

విద్యార్థుల ఆందోళనపై డీఈవో విచారణ



పాశర్లపూడిలంక ఉన్నత పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజులుగా మధ్యాహ్నం భోజనంలో పురుగులు ఉంటున్నాయని ఆరోపిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. భోజన పథకం నిర్వాహకులకు, హెచ్‌ఎంకు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీంతో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని వారు వివరించారు. బియ్యం బస్తాలకు కూడా పురుగులు పట్టి ఉన్నాయని తల్లిదండ్రులు తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కమల కుమారి పాఠశాలలో విచారణ నిర్వహించారు. హెచ్‌ఎంతోను, విద్యార్థులతోను మాట్లాడారు. అన్నం మెత్తగా ఉంటుందని, అప్పుడప్పుడు అన్నంలో పురుగులు ఉంటున్నాయని కొందరు విద్యార్థులు చెప్పారని ఆమె తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు అదనపు టాయ్‌లెట్లు నిర్మాణంలో ఉన్నాయని ఆమె వివరించారు.

చిన్నారులకు తల్లి పాలు శ్రేయస్కరం

అంబాజీపేట: పుట్టిన బిడ్డలకు తల్లి పాలు శ్రేయస్కరమని తద్వారా వ్యాధి నిరోధక టీకాలుగా ఉపయోగపడుతుందని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. వాకలగరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలల్లో పోషక విలువలు కలిగి ఉంటాయని చిన్నారులకు తప్పక పట్టించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఎంపీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

రామం మొక్కలకు బొమ్మల రూపం



వినాయకుని రూపంలో బోన్సాయ్ మొక్కకు మేకప్



అమ్మాయి రూపంలో బోన్సాయ్ మొక్క

ఆకర్షిస్తున్న బోన్సాయ్ మొక్కలు

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్రశ్రీహరి (రామం) పెరట్లో మొక్కలు బొమ్మలుగా ఆకర్షిస్తున్నాయి. అనేక మంది పర్యావరణ ప్రేమికులు మొక్కలు పెంచుతుంటారు. అటువంటి వారికి భిన్నంగా పెద్దింటి రామం అరుదైన మొక్కలు సేకరించి పెంచుతూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. రామం వంశ పారంపర్యంగా పురోహితుడిగా చేసుకుంటూ మరో పక్క వినూత్న ప్రయోగాలు చేస్తూ, అరుదైన వస్తువులతో పాటు ఎక్కడెక్కడి నుంచో అరుదైన మొక్కలు సేకరించి పెంచుతున్నారు. దానిలో భాగంగా మనిషి భాగాల రూపంలో పెరిగిన బోన్సాయ్ అడీనియం మొక్కలను బొమ్మలుగా మలిచి మేకప్ చేసి ప్రదర్శిస్తుంటారు. అటువంటి వాటిలో కొన్ని మొక్కలు ఇవి.

ఊట బారిన లంక పొలాలు



ఊబలంకలో ఊటబారిన పడి కుళ్లిపోయిన పశుగ్రాసం

రావులపాలెం: గోదావరి వరదల కారణంగా నీట మునిగిన లంక పొలాలు ఊట బారిన పడ్డాయి. ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినా లంక పొలాలు నుంచి వరద నీరు పూర్తిగా దిగకపోవడంతో అరటి, కంద, లాంటి వాణిజ్య పంటలు, గోంగూర, మిరప, వంగ, దొండ తదితర కూరగాయల తోటలు ముంపునకు గురై పూర్తిగా పాడైనట్టు రైతులు వాపోతున్నారు. మండలంలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, పొడగట్లపల్లి, గోపాలపురం తదితర గ్రామాల్లో లంక పొలాలు ఊట బారిన పడి పాడైపోయాయి. అలాగే పశుగ్రాసం కూడా నీటిలో సుమారు వారం రోజులు నానడంతో కుళ్లిపోయి పాడైపోయాయని, తిరిగి మళ్లీ విత్తనాలు వేయాలని రైతులు అంటున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



చిరతపూడిలో ఫ్యామిలీ డాక్టర్‌పై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

అంబాజీపేట: సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడి సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నందంపూడిలో సర్పంచ్ పితాని మంగాదేవి ఆధ్యక్షతన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి శ్రీనివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కె.వెంకట్, ఎంపీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు



రామరాజులంక అంగన్‌వాడీని సందర్శించిన డాక్టర్ క్రాంతికిరణ్

మలికిపురం: మండలంలోని వరద ముంపు గ్రామం రామరాజులంకలో శుక్రవారం లక్కవరం పీహెచ్‌సీ వైద్య బృందం శిబిరం ఏర్పాటు చేసింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ క్రాంతికిరణ్ గృహసందర్శనలో భాగంగా రామరాజులంక బాడవలో పర్యటించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో బాధపడుతున్న బోణం దీప్తిని పరీక్షించారు. చిన్నారికి అవసరమైన మందుల పంపిణీకి సిబ్బందికి ఆయన సిఫారసు చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని ప్రజలకు సూచించారు. వినాయకుని గుడి వద్ద వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది నర్సింహారావు, నాగేంద్రకుమార్, ఏఎన్‌ఎంలు సుజాత, కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రేష్మ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, మదీ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

అయినవిల్లి: వరద ప్రభావిత గ్రామం పొట్టిలంకలో నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వేంకటేశ్వరరావు మండల బీజేపీ నాయకులతో కలసి పర్యటించారు. పొట్టిలంకలో ప్రధాన గ్రామానికి ఆనుకుని ఉన్న గోదావరి ఉధృతికి లంక భూమి నదీ కోతకు నదీ గర్భంలో కలసిపోతుందన్నారు. దీని వలన విలువైన పంటభూములు నదీలో కలసిపోవడంతో పొట్టిలంక గ్రామ ప్రజలు ఆందోళన చెందుతు న్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్యను వివరిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ రక్షణ చర్యగా రివిట్‌మెంట్ ఏర్పాటుపై వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.